నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 22 మే 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



దహెగాం కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షపు నీరు




నెన్నెల లో కల్వర్టులో పడిన కారు



సీసీసీ నస్పూర్ : భారీ వర్షానికి రోడ్డుపై నిలిచిన వరద



తాండూర్‌లో కురుస్తున్న వర్షం



కౌటాల : అకాల వర్షానికి కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

# గాలివాన బీభత్సం

## కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

- పలుచోట్ల రాలిన మామిడి కాయలు.. నేలకొరిగిన వరి
- లోతట్టు ప్రాంతాలు జలమయం ● విద్యుత్ సరఫరాకు అంతరాయం
- నెన్నెలలో అదుపుతప్పి కల్వర్టులో పడిపోయిన కారు
- గుండ్ల సోమవారంలో కూలిపోయిన పెండ్లి మండపం, టెంట్లు

తాండూర్/వేమనపల్లి/హాజీపూర్/సీసీసీ నస్పూర్/చెన్నూర్ రూరల్/నెన్నెల/కౌటాల /దహెగాం, మే 21 : మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో బుధవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. పలుచోట్ల మామిడికాయలు రాలిపోగా, వరి నేలకొరిగింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిముద్దయ్యింది. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా, ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. తాండూర్ మండలం మాదారం పోలీస్‌స్టేషన్ గ్రౌండ్ జలమయమైంది. మామిడి కాయలు రాలిపోయాయి. కొనుగోలు కేంద్రంలోని ధాన్యం తడిసింది. ధాన్యం కుప్పలపై, తూకం వేసిన బస్తాలపై టార్పాలిన్లు కప్పి కప్పుకోవడానికి రైతులు తిప్పలు పడ్డారు. వేమనపల్లిలో కురిసిన వర్షానికి మట్టి రోడ్లు బురదమయంగా మారాయి. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్ద అయ్యింది. పలుచోట్ల వరి నేలకొరిగింది. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. భారీ వర్షానికి హాజీపూర్ మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌లోని బ్రేకర్లు పని చేయకపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నస్పూర్ పట్టణంలో భారీ వర్షం కురిసింది. 4 గంటలకు ప్రారంభమైన వర్షం 7 గంటల వరకు ఏకధాటిగా పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయమైయ్యాయి. వాగులు, వంకలు, డ్రైనేజీలు ఉప్పొంగి ప్రవహించాయి. రోడ్లను వరద ముంచెత్తింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. చెన్నూర్ మండలం కొమ్మెర, పొక్కూర్, ఆస్నాద్, ఎర్రగుంటపల్లి, కిష్టంపేట, ముత్తరావుపల్లి, ఓత్కులపల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్ద అయింది. ఆస్నాద్ గ్రామంలో వరద ప్రవాహానికి సెంటర్‌లో ఉన్న ధాన్యం కొట్టుకుపోయింది. పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నెన్నెల మండలం గొల్లపల్లి గ్రామంలో దెబ్బ తిన్న వరి పంటను భీమిని ఏడీఏ సురేఖ, ఏవో సృజన, ఏఈవోలు రాంచందర్, షైనీ పరిశీలించారు. పంట నష్టం అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని ఏడీఏ రైతులకు చెప్పారు. నెన్నెల నుంచి బెల్లంపల్లి వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి నెన్నెలలోని కల్వర్టులో పడి పోయింది. అందులోని ఆరుగురు ప్రమాదం నుంచి బయటపడ్డారు. బీఎస్ఎన్ఎల్ టవర్ వద్ద ఉన్న కల్వర్టు పనులను కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేశాడని, ఇక్కడ ప్రమాదాలు జరిగే అవశాలున్నాయని గ్రామస్తులు మండిపడుతున్నారు. గాలివానకు గుండ్లసోమారంలో పెండ్లి మండపం, టెంట్లు కూలిపోయాయి. కేంద్రాల్లోని ధాన్యం కుప్పలు తడిసి పోయాయి. లంబాడీ తండా సమీపంలోని ఎర్రవాగు తాత్కాలిక కల్వర్టు బురదమయంగా మారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురుసింది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం తడిసిపోయింది. వరదకు వడ్లు కొట్టుకుపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. దహెగాం మండలం లగ్గాం, ఒడ్డుగూడ, గిరివెల్లి, చంద్రపల్లి, కొంచవెల్లి, కల్వాడ, దహెగాం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. కాగా, ఎండలతో సతమతమవుతున్న ప్రజలకు ఈ వర్షం కాస్త ఉపశమనం కలిగించింది.



మంచిర్యాల లో కురుస్తున్న వర్షం



నెన్నెల : గుండ్లసోమారంలో గాలివానకు కూలిన పెండ్లి మండపం, టెంట్లు



నెన్నెల : గొల్లపల్లిలో నీట మునిగిన వరిని పరిశీలిస్తున్న ఏడీఏ



చెన్నూర్ రూరల్ : :కిష్టంపేట కొనుగోలు కేంద్రంలో కురుస్తున్న వాన

# చీకట్లో సర్కారు దవాఖాన

- కనీసం జనరేటర్ లేదు ● తీవ్ర ఇబ్బందులు పడ్డ రోగులు





అంధకారంలో జిల్లా ప్రభుత్వ దవాఖాన

ఆసిఫాబాద్ టౌన్ , మే 21: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రభుత్వ దవాఖానను సైతం కరెంట్ కష్టాలు వదలడం లేదు. బుధవారం సాయంత్రం కురిసిన గాలివానకు సాయంత్రం నాలుగు గంటల నుంచి కరెంట్ సరఫరా నిలిచిపోయింది. జనరేటర్ కూడా లేకపోవడంతో రోగులు చీకట్లో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. పలు ప్రజా సంఘాల నాయకులు హాస్పిటల్‌ను సందర్శించి రోగుల కష్టాలు తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని పెద్ద హాస్పిటల్‌లోనే పరిస్థితే ఇలా ఉంటే.. ఇక పల్లెల్లో కరెంట్ కష్టాల గురించి చెప్పనక్కర్లేదన్నారు. జిల్లాలో మంత్రులు పర్యటనలు చేసినప్పటికీ రోగుల కష్టాలు తీరడం లేదని, అనేకసార్లు అధికారులకు వినతి పత్రాలు అందజేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోగుల కష్టాలు తీర్చాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. కాగా, రాత్రి 8 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

# డీఆర్వో తిరుపతి సస్పెన్షన్

జన్నారం, మే 21 : జన్నారం రేంజ్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ తిరుపతిని సస్పెన్షన్ చేస్తూ కాళేశ్వరం జోన్ పీసీసీఎఫ్ శాంతరాం ఉత్తర్వులు జారీచేశారు. గతంలో కొత్తూరుపల్లె గ్రామ సమీప అటవీభూమిలో ఎస్టీలు గుడిసెలు వేసుకోగా, ఈ విషయంలో తిరుపతి నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ సస్పెండ్ చేశారు.

# కొనుగోలు కేంద్రాల లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి



కోటపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**

కోటపల్లి, మే 21 : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు కేటాయించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. బుధవారం పారుపల్లి, దేవులవాడ, లక్ష్మీపూర్, అన్నారం, సర్వాయిపేట, కోటపల్లిలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. జిల్లాలో 345 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని, సన్న రకం వడ్లను విక్రయించిన రైతులకు మద్దతు ధరకు అదనంగా రూ.500 బోనస్ అందిస్తున్నామన్నారు. అనంతరం కోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. వార్డులు, పరిసరాలను పరిశీలించారు. వైద్యాధికారిణి అరుణశ్రీ విధుల్లో లేకపోవడంతో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారిణి భోజనానికి వెళ్లిందని వారు చెప్పగా, ఈ సమయంలో భోజన విరామం ఏమిటని అసహనం వ్యక్తం చేశారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు సమయ పాలన పాటించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. తహసీల్దార్ రాఘవేంద్రరావ్, డిప్యూటీ తహసీల్దార్ నవీన్, సిబ్బంది ఉన్నారు.

**కొనుగోళ్లు వేగవంతం చేయాలి**

చెన్నూర్ రూరల్, మే 21 : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని వేగవంతంగా సేకరించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. పలు గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం పరిశీలించారు. రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని, కాంటా అయిన బస్తాలను వెంట వెంటే లోడ్ చేయించాలని నిర్వాహకులకు సూచించారు. మూడు రోజుల పాటు వర్షాలున్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని ఎంపీడీవోకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ మల్లికార్జున్ ఉన్నారు.

# 'హస్తం'లో ప్రొటోకాల్ రగడ

## పీఎస్ఆర్-గడ్డం వంశీ వర్గాల మధ్య గొడవ

- ఎంపీ వంశీకి ప్రొటోకాల్ ఇవ్వలేదంటూ నిరసన తెలిపేందుకు వచ్చిన యూత్ కాంగ్రెస్
- దళితుడైనందునే సరస్వతీ పుష్కరాలకు ఆహ్వానించలేదంటూ ఆగ్రహం
- వారిని అడ్డుకున్న మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్ఆర్ వర్గం
- మంచిర్యాల ఐబీ చౌరస్తాలో ఇరువర్గాల బాహాబాహీ

మంచిర్యాల, మే 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్ఆర్-పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ వర్గాల మధ్య ప్రొటోకాల్ రగడ ముదిరిపాకాన పడుతున్నది. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ దళితుడైనందునే సరస్వతీ పుష్కరాలకు ఆహ్వానించకుండా, కనీసం ప్రభుత్వ ఫ్లెక్సీల్లో ఆయన ఫొటో పెట్టకుండా అవమానించారరంటూ ఆయన అనుచర, అభిమానవర్గం మండిపడుతున్నది. చిన్న వయసులోనే ఎంపీగా గెలిచిన గడ్డం వంశీని చూసి జీర్ణించుకోలేని కాంగ్రెస్ పార్టీ పెద్దలు, ఆయనను కావాలనే పార్టీ నుంచి దూరం చేస్తున్నారంటూ ఆరోపిస్తున్నది. కాళేశ్వరంలో పుష్కరాలు మొదలైనప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీలో ఈ వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారింది. ప్రొటోకాల్ పాటించకుండా దళిత ఎంపీని అవమానించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు క్షమాపణలు చెప్పాలనే డిమాండ్ వినిపిస్తున్నది. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గవ్యాప్తంగా రోజురోజుకూ ఈ వివాదం ముదురుతున్నది. ఈ నేపథ్యంలో తాజాగా మంచిర్యాల జిల్లా కేంద్రంలో బుధవారం సాయంత్రం ఎంపీ వంశీ వర్గానికి-మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్ఆర్ వర్గానికి మధ్య గొడవ జరిగింది. ఇరు వర్గాల నేతలు రోడ్డుపైనే బాహాబాహీకి దిగడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణను కాళేశ్వర పుష్కరాలకు ఆహ్వానించకపోవడాన్ని నిరసిస్తూ చెన్నూర్, మందమర్రి, బెల్లంపల్లికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు జిల్లా కేంద్రంలో నిరసన తెలపాలని నిర్ణయించారు. ఈ మేరకు ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి, నిరసన తెలిపేందుకు ఎంపీ వంశీ వర్గం నాయకులు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో కొందరు స్థానిక కాంగ్రెస్ నాయకులు వంశీవర్గం నాయకులను అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. రోడ్డుపైనే నాయకులు రచ్చ రచ్చ చేశారు. ఒక వర్గంపై మరో వర్గం దాడి చేసుకునే దాకా వెళ్లింది. మంచిర్యాలలో నిరసన తెలిపేందుకు మీరు ఎందుకు వచ్చారు. కాంగ్రెస్ పార్టీని విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు చేస్తున్నారంటూ పీఎస్ఆర్ వర్గం.. దళిత ఎంపీకి అవమానం జరిగితే నిరసన తెలిపే హక్కు లేదా.. ఇదేం పద్ధతి అంటూ వంశీవర్గం పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. వారికి నచ్చచెప్పి అక్కడి నుంచి పంపించి వేశారు.



మంచిర్యాలలోని ఐబీ చౌరస్తాలో గుమిగూడిన కాంగ్రెస్ నాయకులు

**గ్రూప్ రాజకీయాలు చేస్తే చూస్తూ ఊరుకోం : పీఎస్ఆర్ వర్గం**

మంచిర్యాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీని విచ్ఛిన్నం చేసేందుకు చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్, పెద్దపల్లి ఎంపీ వంశీ కంకణం కట్టుకున్నారని మంచిర్యాల కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఐబీ చౌరస్తాలో గొడవ అనంతరం నస్పూర్ మాజీ చైర్మన్ సుర్మిళ్ల వేణు, మంచిర్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్నారని, పార్టీ విధానాలకు వ్యతిరేకంగా పని చేస్తున్నారని మండిపడ్డారు. పూటకో పార్టీ మారుస్తూ.. కేవలం అధికారం కోసమే గడ్డం వివేక్, వంశీ కాంగ్రెస్ పార్టీలో చేరారని ఆరోపించారు. జిల్లా కాంగ్రెస్‌ను పట్టుకొని పదిపదిహేను సంవత్సరాలు కష్టపడి, అధికారంలోకి తెచ్చేందుకు కష్టపడ్డ కాంగ్రెస్ పార్టీ నాయకులుగా పార్టీలో గ్రూప్‌రాజకీయాలను ప్రోత్సహిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. దళిత ఎంపీకి ఎక్కడ అవమానం జరిగిందో అక్కడ ధర్నాలు, రాస్తారోకోలు చేసుకోవాలే తప్ప.. మంచిర్యాలకు వచ్చి కాంగ్రెస్‌లో గ్రూప్ రాజకీయాలు చేస్తే సహించేది లేదన్నారు. జిల్లాలో ఒక కుటుంబంలా ఉన్న కాంగ్రెస్ పార్టీని తండ్రీ,కొడుకులు కలిసి రెచ్చగొడుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఎవరున్నారు.. బీఆర్ఎస్ పార్టీలో ఎవరున్నారో కూడా వారికి తెలియడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో సొంత ఎజెండా కోసం, సొంత కేడర్ కోసం ప్రయత్నిస్తున్న వారిపై పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు.



ఐబీ చౌరస్తాలో బాహాబాహీకి దిగిన కాంగ్రెస్ నాయకులను చెదరగొడుతున్న పోలీసులు

**దళిత ఎంపీని అవమానిస్తే సహించం : పెద్దపల్లి ఎంపీ వంశీ వర్గం**

పెద్దపల్లి ఎంపీ వంశీ వర్గానికి చెందిన నాయకులు మాట్లాడుతూ.. కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ పుష్కరాల ఏర్పాట్లలో పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ ఎంతగానో కృషి చేశారని అన్నారు. పుష్కర ప్రదేశాన్ని పరిశీలించి ఏర్పాట్లు చేయించారన్నారు. అలాంటి నాయకుడికి పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ప్రొటోకాల్ ఇవ్వకుండా అవమానిస్తున్నారని వాపోయారు. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంచిర్యాల ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి, ప్లకార్డులతో నిరసన తెలిపేందుకు వస్తే స్థానిక నాయకులు వచ్చి అడ్డుకోవడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో దళితులకు జరుగుతున్న అన్యాయన్ని, అవమానాన్ని ప్రశ్నించే హక్కు లేదా చెప్పాలన్నారు. దళితులంటే ఎందుకు అంత చిన్నచూపు చూస్తున్నారో చెప్పాలన్నారు. అతి చిన్న వయసులోనే ఎంపీగా గెలిచిన వంశీకృష్ణ పేద, మధ్య తరగతి కుటుంబాల అభ్యున్నతికి ఎంతగానో తోడ్పడుతున్నారన్నారు. అలాంటి నాయకుడికి జరుగుతున్న అవమానాన్ని తాము ముక్తకంఠంతో ఖండిస్తున్నామన్నారు. ఇకపై దళిత నాయకుడైన వంశీని అవమానిస్తే ఊరుకునేది లేదంటూ హెచ్చరించారు. ఇలా జిల్లా కేంద్రంలో ఇరువర్గాలు బాహాబాహికి దిగడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే మంత్రి పదవి విషయంలో గడ్డం వివేక్, మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్ఆర్‌కు మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. గతంలోనూ ఈ విషయంలో ఇద్దరు నాయకులు పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ రెండు వర్గాలుగా చీలిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో వివేక్ కుమారుడు పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణకు ప్రొటోకాల్ రగడ మరోసారి జిల్లా కాంగ్రెస్ పార్టీలో లుకలుకలను బయటపెట్టింది. ఇరువర్గాల వాగ్వాదం, పరస్పర ఆరోపణలతో కాంగ్రెస్ పార్టీలో వివాదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. మరి ఈ వ్యవహారంపై పార్టీ పెద్దలు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.